## ఏసీపీ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ



పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్, అక్టోబర్ 28: పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజారక్షణ కోసం పాటుపడుతూ విధి నిర్వాహణలో ఎంతో మంది అసువులు బాసారని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎల్బీనగర్, నాగోల్, చైతన్యపురి, సరూర్‌నగర్, మహిళా పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులు ఎల్బీనగర్ చౌరస్తా నుంచి కొత్తపేట చౌరస్తా వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజలందరూ పోలీసులకు సహకరించినప్పుడే శాంతి భద్రతలను కాపాడేందుకు వీలవుతుందన్నారు. ప్రజలు సైతం పోలీసులలో భాగమేనని.. నేరాల అదుపుకు ప్రజలు తోడ్పాటునందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ సీఐ వినోద్‌కుమార్, నాగోల్ సీఐ సూర్యానాయక్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుధాకర్, చైతన్యపురి సీఐ వెంకటేశ్వరరావు, సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వనస్థలిపురం సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ కాశీరెడ్డి తదితరులు

## వనస్థలిపురం పోలీసుల సైకిల్ ర్యాలీ

వనస్థలిపురం, అక్టోబర్ 28: పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వనస్థలిపురం పోలీసులు సోమవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు నిబద్ధతతో పనిచేస్తారన్నారు. ప్రజలకు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఏసీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పనామా చౌరస్తా, ఆటోనగర్, సుష్మా థియేటర రైతుబజార గణేశ్ టెంపుల్ మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల భూమిని పరిరక్షించాలని ప్రజావాణిలో ఫిర్యాదు



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు

మన్సూరాబాద్, అక్టోబర్ 28: నాగోల్ డివిజన్ పరిధి బండ్లగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎకరం స్థలాన్ని పరిరక్షించాలని బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు మాట్లాడుతూ.. రెవెన్యూ, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వలన కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేలా ఉందన్నారు. గతంలో తాసీల్దార్ సర్వే చేపట్టి ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వ పాఠశాల భూమి సర్వే నం.36/6లో ఉందని తేలిందన్నారు. ఈ విషయంపై కొందరు ప్రైవేటు వ్యక్తులు కోర్టుకు వెళ్లగా రెవెన్యూ అధికారులు, విద్యాశాఖ అధికారులు సరిగా స్పందించలేదని తెలిసిందన్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయ్యే పరిస్థితులు తలెత్తాయని తెలిపారు. పాఠశాల స్థలాన్ని పరిరక్షించేందుకు జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేయడం జరిగిందని.. త్వరలో ఈ విషయంపై మంత్రులతో పాటు స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు శ్రీనివాసచారి, సహదేవ్ గౌడ్, పంగ గౌతమ్, కందికంటి రాఘవేందర్‌గౌడ్, మెట్టు రవీందర్‌గౌడ్, గడ్డం రామారావుగౌడ్, భవానీశంకర్, పాండుగౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నాగరాజు మృతికి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



బడంగ్‌పేట, అక్టోబర్ 28: తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలో గుండె పోటుతో మరణించిన రచ్చ నాగరాజు పార్థివదేహానికి ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదర్చి కుటుంబానికి అండగా ఉంటామని బరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో జిల్లెల లక్ష్మయ్య, సప్పిడి రాజు, భాట సురేశ్, ప్రభాకర్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుసుమ నూనె ఆరోగ్యానికి మేలు



సమావేశంలో పాల్గొన్న ఐసీఏఆర్ – ఐఐఓఆర్ న్యూఢిల్లీ డీడీజీ డా.శర్మ

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 28 : కుసుమ నూనె ఆరోగ్యానికి మేలు చేస్తుందని, కుసుమలో ముల్లులేని రకాలను కనుగొనేలా పరిశోధనలు జరుగాలని జాతీయ నూనెగింజల పరిశోధనా మండలి (ఐసీఏఆర్ – ఐఐఓఆర్ న్యూఢిల్లీ ) డీడీజీ డా.శర్మ అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వాటర్ టెక్నాలజీ సమావేశ మందిరంలో జాతీయ నూనెగింజల పరిశోధనలు, పీజేటీఎస్ఏయూ ప్రణాళిక రూపకల్పన రెండు రోజుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇతర దేశాల నుంచి రూ.1.7 లక్షల కోట్లు వెచ్చించి నూనెలను దిగుమతి చేసుకుంటున్నామన్నారు. దీనిని తగ్గించడానికే భారత జాతీయ నూనెగింజల మిషన్‌ని ఏర్పాటు చేశారన్నారు. కుసుమలో లైనోలేనిక్ ఆసిడ్ ఉన్నందున కరోనా నాటి నుంచి డిమాండ్ పెరిగిందన్నారు. ఏడీజీ డా.సంజీవ్ మాట్లాడుతూ.. కుసుమ, అవిసెల సాగుకు అధిక రాష్ట్రాల వాతావరణం అనుకూలమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూనెగింజల సాగుకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. రైతు అవగాహన సదస్సులు, పరిశోధనలు పెరిగాయని మరింత పెరుగాల్సిన అవసరం ఉందన్నారు. రబీలో కుసుమ సాగు ఎక్కువగాఉంటుందని, వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులకు నూనెగింజల సాగు, చీడపీడలపై అవగాహన కల్పిస్తున్నామని పీజేటీఎస్ఏయూ అగ్రికల్చర్ డీన్ జెల్లా సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలోప్రధాన శాస్త్రవేత్త డా.సి.సుధాకర్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం వివిధ రాష్ట్రాల ఆదర్శరైతులు, శాస్త్రవేత్తలను సన్మానించారు.

# ఎస్ఎన్‌డీపీ పనులతో సత్ఫలితాలు

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



లింగోజిగూడ ధర్మపురికాలనీలో నిర్మించిన ఎస్ఎన్‌డీపీ పనులను పరిశీలిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్/చంపాపేట, అక్టోబర్ 28: ఎల్బీనగర్ నియోకవర్గం పరిధిలో ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ధర్మపురి కాలనీతో పాటు పరిసర కాలనీల్లో నిర్మించిన ఎస్ఎన్‌డీపీ పనులను పరిశీలించి మాట్లాడారు. గతంలో చిన్నపాటి వర్షానికి కూడా కాలనీలు జలమయం అయ్యేవని, ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి చేసిన నేపథ్యంలో కాలనీలన్నీ సురక్షితంగా మారాయని అన్నారు. ఎల్బీనగర్ నియోకవర్గం వ్యాప్తంగా ముంపు ప్రాంతాలన్నీ ఎస్ఎన్‌డీపీ పనులతో సంపూర్ణంగా ముంపు నుంచి విముక్తి అవుతున్నాయని తెలిపారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయని ఇవి పూర్తయితే ఎల్బీనగర్ నియోజకవర్గం ముంపు రహిత ప్రాంతంగా మారుతుంనన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిలక్‌రావు, సుజిత్, చిత్రం సాయి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో మాలల సభ గ్రాండ్ సక్సెస్

- నవంబర్ 24న హైదరాబాద్‌లో మాలల సత్తా చాటుతాం
- తెలంగాణ మన మాలల సొసైటీ అధికార ప్రతినిధులు పార్శపు శ్రీధర్, రాసమల్ల శ్రీనివాస్

ఎల్బీనగర్, అక్టోబర్ 28: నాగర్‌కర్నూల్‌లో ఆదివారం నిర్వహించిన మాలల సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని తెలంగాణ మన మాలల సొసైటీ అధికార ప్రతినిధులు పార్శపు శ్రీధర్, రాసమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మాలల ఐక్యతకు నాగర్‌కర్నూల్ సభ నాంది పలికిందని అన్నారు. తెలంగాణలో మాలలు లేరనే వారికి నవంబర్ 24న హైదరాబాద్‌లో జరిగే మాలల మహా సభలో సత్తా చాటుతామని పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మాలలంతా ఐకమత్యంతో గ్రామగ్రామాన ఒక్కటి అవుతున్నారని, రాబోయే రోజుల్లో మాలలంతా అన్ని రాజకీయ పార్టీలకు తమ బలాన్ని రుచి చూపిస్తారని అన్నారు. వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడదీసి రిజర్వేషన్లను సమూలంగా లేకుండా చేసే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.

## పదవీ బాధ్యతలు చేపట్టిన కొత్త కమిషనర్లు



మీర్‌పేట కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్



బడంగ్‌పేట కమిషనర్ సరస్వాతి

బడంగ్‌పేట, అక్టోబర్ 28: మీర్‌పేట కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, బడంగ్‌పేట కమిషనర్‌గా సరస్వాతి, తుక్కుగూడ మున్సిపాలిటీ కమిషనర్‌గా వాణీదేవి, జల్‌పల్లి కమిషనర్‌గా వెంకట్రామ్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు.

## కందుకూరు డివిజన్ ఆర్డీవోగా జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, అక్టోబర్ 28: కందుకూరు డివిజన్ ఆర్డీవోగా జగదీశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేసిన సూరజ్‌కుమార్ ఆగస్టు 31న పదవీ విరమణ చేయడంతో అప్పటి నుంచి ఆర్డీవో స్థానం ఖాళీగా ఉంది. ఎట్టకేలకు ప్రభుత్వం నర్సాపూర్ ఆర్డీవోగా పని చేస్తున్న ఆయనను కందుకూరుకు బదిలీ చేశారు.

## ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు స్థానికులకు దక్కేలా చర్యలు



టీ పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌కు విన్నవించుకుంటున్న కాలనీవాసులు

మన్సూరాబాద్, అక్టోబర్ 28: ఎరుకల నాంచారమ్మకాలనీలో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అర్హులైన స్థానికులకు కేటాయింపజేస్తానని టీ పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధి ఎరుకల నాంచారమ్మ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో ఖాళీగా ఉన్న వాటిని స్థానికులకు కేటాయింపజేయాలని కోరుతూ మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలుసుకున్నారు. పదిహేను సంవత్సరాలుగా ఎరుకల నాంచారమ్మ బస్తీలో నివాసం ఉంటున్నామని.. కాలనీలో 288 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించగా ఇందులో ఇప్పటికే 200 ఇండ్లను ఇతరులకు కేటాయించారని మధుయాష్కీగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఖాళీగా ఉన్న ఇండ్లు తమకు కేటాయింపజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికులను గుర్తించి లిస్ట్ రెడీ చేయాలని రెవెన్యూ అధికారులను కోరడం జరిగిందన్నారు. సంవత్సరాల తరబడిగా కాలనీలో నివాసముంటున్న పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు దక్కేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎరుకల నాంచారమ్మ కాలనీవాసులు పాల్గొన్నారు.

## మహిళలకు దుస్తులు పంపిణీ చేసిన కేఎల్ఆర్



బడంగ్‌పేట, అక్టోబర్ 28: మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దీపావళి సందర్భంగా జల్‌పల్లికి సంబంధించిన మహిళలకు దుస్తువులు, నిత్యావసర సరుకులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, యూసఫ్ ఖాద్రీ, కప్పాటి పాండు రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన మేయర్



బడంగ్‌పేట, అక్టోబర్ 28: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 23,24వ డివిజన్‌లో అభివృద్ధి పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, ఏఈ వినీల్ గౌడ్, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

## కేటీఆర్‌పై కుట్ర



కందుకూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

కందుకూరు, అక్టోబర్ 28: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నట్లు మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. రాజకీయంగా ఎదుర్కొనే సత్తాలేక దొడ్డి దారిన దెబ్బతీయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దీపావళికి ఇంట్లో దావత్ చేసుకుంటే తప్పా.. అది ఫాంహౌజ్ కాదని కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఉండే ఇళ్లని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న కేటీఆర్‌ను ఎదుర్కొనే సత్తా లేక.. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్‌ను ఎన్నిరకాలుగా ఇబ్బందులు పెట్టిన అండగా ఉంటామని.. తాటాకు చప్పుల్లకు బెదిరేది లేదని వివరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తల్లోజు లక్ష్మణాచారి, బొక్క వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## సామనగర్ అభివృద్ధికి సహకరించండి



జోనల్ కమిషనర్ హేమంతకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

వనస్థలిపురం, అక్టోబర్ 28: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సామనగర్ కాలనీ అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. సోమవారం కాలనీవాసులతో కలిసి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో సీసీ రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని నిర్మించేందుకు అత్యవసరంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. దాంతోపాటు డ్రైనేజీ, పార్కు, వీధి దీపాలను మంజూరు చేయాలని కోరారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు యాదగిరి రెడ్డి, సతీశ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, అంజన్‌కుమార్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

# కొడుకు చనిపోయినా..గుర్తించలేదు..


- కంటి చూపు లేకపోవడంతో తెలుసుకోలేక పోయిన దివ్యాంగ తల్లిదండ్రులు
- మూడు రోజులు మృతదేహంతోనే.. దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు
- వృద్ధ దంపతుల దుస్థితి చూసి..చలించిపోయిన పోలీసులు



ప్రమోద్‌కుమార్ (ఫైల్)

మన్సూరాబాద్, అక్టోబర్ 28: కొడుకు చనిపోయిన విషయం తెలియని దివ్యాంగులైన తల్లిదండ్రులు మృతదేహంతోనే మూడు రోజుల పాటు గడిపారు. బయట ప్రపంచాన్ని చూడలేని స్థితిలో ఉన్న వృద్ధ దంపతులు తమ కొడుకు వచ్చి భోజనం పెడతాడేమోనని ఆకలితో అలమటిస్తూ ఎదురు చూడసాగారే కానీ పక్కనే కొడుకు నిర్జీవంగా పడి ఉన్న విషయాన్ని గ్రహించలేకపోయారు. ఇంట్లో ఏదో దుర్వాసన వస్తున్నప్పటికీ ఏదో జీవి చనిపోయిందనుకున్నారే కానీ.. చనిపోయిన కుమారుడి మృతదేహం నుంచి వస్తున్న దుర్వాసనను తెలుసుకోలేని స్థితి వారిది. మూడు రోజుల నుంచి సదరు ఇంటి నుంచి ఎవరూ బయటకు రాకపోవడం.. ఏదో దుర్వాసన వస్తుండటంతో కంగారు పడిన స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో దివ్యాంగుల కుమారుడు మృతి చెందిన విషయం బయటపడింది. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్, జైపురికాలనీ, బ్లైండ్స్‌కాలనీకి చెందిన రమణ (59), శాంతకుమారి (64)కి ఇద్దరు కుమారులు కె.ప్రదీప్‌కుమార్, కె.ప్రమోద్‌కుమార్ (32) ఉన్నారు. రమణ, శాంతకుమారి ఇద్దరు కంటి చూపులేదు.. దివ్యాంగులు. రమణ ట్రైబల్ వెల్ఫేర్‌లో ఉద్యోగి.. కంటి చూపు లేక పోవడంతో వేరే వ్యక్తిని తన ఉద్యోగంలో సహాయకుడిగా పెట్టుకున్నారు. పెద్ద కుమారుడు ప్రదీప్‌కుమార్ తన భార్యతో కలిసి వేరుగా ఉంటున్నాడు. చిన్న కుమారుడు ప్రమోద్‌కుమార్ వృత్తిరీత్యా పెయింటర్. ప్రమోద్‌కుమార్ తన భార్యతో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉండే వాడు. ప్రమోద్‌కుమార్ మద్యానికి బానిసగా మారడంతో నాలుగు సంవత్సరాల క్రితం భార్య ఇంటి నుంచి వెళ్లి పోయింది. ప్రమోద్‌కుమార్‌కు తరచూ ఫిట్స్ వచ్చేవి. తండ్రికి వచ్చే జీతంతో జల్సాలు చేయడం, మద్యం తాగడాన్ని అలవర్చుకున్నాడు. రమణ, శాంతకుమారి ప్రమోద్‌కుమార్‌పై ఆధారపడి జీవించేవారు. ఇదిలా ఉండగా మూడు రోజుల క్రితం మద్యం తాగి వచ్చిన ప్రమోద్‌కుమార్‌కు ఫిట్స్ రావడంతో మృతి చెందాడు. కంటి చూపులేని దివ్యాంగులైన రమణ, శాంతకుమారి కుమారుడు తమ కండ్ల ఎదుటే చనిపోయి పడి ఉన్న విషయాన్ని గమనించలేకపోయారు. కుమారుడు వస్తాడు.. ఇంత భోజనం పెడతాడని ఎదురు చూడసాగారు. ఆకలితో అలమటిస్తున్న వారికి కుమారుడి మృతదేహం నుంచి వస్తున్న దుర్వాసనను ఏదో జీవి చనిపోయిందేమో ఇంట్లో అనుకుంటున్నారే తప్ప.. తమ కుమారుడి మృతదేహం నుంచి వస్తున్న దుర్వాసన అని తెలుసుకోలేక పోయారు. మూడు రోజులుగా ఇంట్లో నుంచి ఎవరూ రాకపోవడం.. ఇంట్లో నుంచి ఏదో దుర్వాసన వస్తుండటాన్ని గ్రహించిన స్థానికులు విషయాన్ని నాగోల్ పోలీసులకు తెలియజేశారు. సోమవారం మధ్యహ్నం ఒంటి గంట సమయంలో సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తొలగించి లోనికి వెళ్లిన పోలీసులు ఇంట్లోని వాతావరణం చూసి కంగుతిన్నారు. ఒకవైపు కుళ్లి పోయిన స్థితిలో మృతదేహం పడి ఉండగా.. మరోవైపు ఇద్దరు దివ్యాంగులు ఏమి తెలియని స్థితిలో ఉండటాన్ని చూసిన పోలీసులు చలించిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. నాగోల్ సీఐ సూర్యానాయక్, ఎస్సై శివనాగప్రసాద్‌లు దివ్యాంగులైన రమణ, శాంతకుమారిలను ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చి భోజన సదుపాయాన్ని కల్పించారు. కుటుంబ వివరాలను తెలుసుకున్న పోలీసులు విషయాన్ని పెద్ద కుమారుడైన ప్రదీప్‌కుమార్‌కు తెలియజేసి అక్కడికి రప్పించి రమణ, శాంతకుమారిని అతడికి అప్పగించారు. మూడు రోజుల నుంచి ఇంటి నుంచి ఎవరూ బయటకు రాకపోయిన విషయాన్ని స్థానికులు గమనించకపోవడం శోచనీయం. ప్రదీప్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగ కల్పనలో బీసీలకు తీవ్ర అన్యాయం



నవంబర్ 3న మిర్యాలగూడలో జరుగనున్న బీసీ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

మన్సూరాబాద్, అక్టోబర్ 28: జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు కోరారు. నవంబర్ 3న మిర్యాలగూడలో నిర్వహించనున్న బీసీ గర్జన పోస్టర్‌ను సోమవారం ఎల్బీనగర్‌లోని మహాత్మా జోత్యిరావు పూలే విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చామకూర రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ కల్పనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని దీని వెనుక ఉన్న కుట్రలను చేదించాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో ఒకవైపు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాలు మరోవైపు జీఓ నం.29 తీసుకొచ్చి బీసీలకు ఉన్నత ఉద్యోగాలు లభించకుండా చేస్తున్నాయని విమర్శించారు. బీసీలు రాజకీయ రంగంపై పట్టు సాధించుకోకపోవడం వలనే విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. బీసీ రాజకీయ చైతన్య వేదిక, బీసీ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ గర్జనకు ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ టి.చిరంజీవులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హన్మంతరావు, ఆర్.కృష్ణయ్య తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీ గౌడ్, బొమ్మ రఘురాం నేత, ఎస్.దుర్గయ్యగౌడ్, డాక్టర్ అవ్వరు వేణు కుమార్, వాసుదేవ్ పటేల్, వేముల కొండల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేదునూరులో ఇనాం భూమిని దళితులకు ఇవ్వాలి



ఇనాం భూమిలో సీపీఎం పార్టీ నాయకులు, దళితులు

కందుకూరు, అక్టోబర్ 28: మండల పరిధిలోని నేదునూరు గ్రామంలోని ఇనాం భూమిని దళితులకు ఇవ్వాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకులు రాంచందర్, మండల కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఆ భూమిని గ్రామ పార్టీ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 154సర్వే నంబర్‌లో 35గుంటల భూమి ఉందని 1993వరకు దళితులు పహాణిలో పట్టా కాలంలో ఉన్నారని పేర్కొన్నారు. ఆ భూమిని అదే గ్రామానికి చెందిన మునగల వెంకట్‌రెడ్డి ఎలాంటి ఫైల్ నంబర్ లేకుండా పట్టా కాలంలో పేరు ఎక్కించుకొని కబ్జా చేసినట్లు తెలిపారు. దళితులు, పేదలు, ఒక్కటై సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దళితులకు దక్కాల్సిన భూమిని రికార్డుల పరంగా అధికారులు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి యాదయ్య, రంగం చెన్నయ్య, ఆదారాల నర్సింహ, నాగని యాదయ్య, మిద్దె రాజయ్య, గోపనె శ్రీనివాస్, బొర్ర సురేశ్, మహిళలు పాల్గొన్నారు.